క్లుప్తంగా

ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం రైతుసేవా కేంద్రంలో రైతులకు స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం ఎరువులు పంపిణీ చేశారు.వీఏఏ ప్రసాద్ మాట్లాడుతూ 87మంది రైతులకు రాయితీపై యూరియా బస్తాలు అందజేశామని చెప్పారు.డీసీసీబీ మాజీ చైర్మన్,ఎంపీటీసీ వేచలపు వెంకట చిన రామునాయుడు, సర్పంచ్ దేవి, ఉపసర్పంచ్ పెదనాయుడు, మాజీ ఎంపీటీసీ జగ్గుబాబు తదిత రులు పాల్గొన్నారు.

మద్యం సీసాల ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుర్ల: మండలంలో ఇదివరకు ఎస్ఈబీ అధికారులు 11 కేసుల్లో సీజ్ చేసిన 97 మద్యం సీసాలను ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల అనుసారం మ ద్యం సీసాలను ధ్వంసం చేశామని ఎస్ఐ చెప్పారు. అక్రమంగా మద్యం తరలించే వారిపై నిఘా పెట్టామని తెలిపారు.

ఎంపీపీ పుట్టినరోజు వేడుకలు



ఎంపీపీ సత్యవంతుడుకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

వేపాడ: మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు పుట్టినరోజు వేడుకలను కొత్త వలసలోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎంపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని సత్కరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కోమటిపల్లిలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

దత్తిరాజేరు: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మండలంలోని వింధ్యవాసి, కోమటిపల్లి, వంగర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై శనివారం ప్రచారం నిర్వహించారు.కమిటీ సభ్యుడు శంకరరావు మాట్లాడుతూ ప్రతీ మానవుడు తాను చేసిన కర్మ ప్రతి ఫలాన్ని తప్పక అనుభవిస్తాడని, కర్మయోగం, విశిష్టత గురించి త్రైత సిద్ధాంత భగవద్గీత తెలియజేస్తుందన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీతలోని అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసు కోవడంతో పాటు వాటిని అనుసరించాలని కోరారు. కమిటీ సభ్యులు జయలక్ష్మి, పద్మ, శిరీష, భానుమతి, మోహన్, దుర్గారావు, లత, సూరిబాబు, నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

మాజీ మంత్రి సాంబశివరాజు సేవలు మరువలేనివి



సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు చేసిన సేవలు మరువలేనివని ఆయన తనయుడు,ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కొనియాడారు. మండలంలోని మొయి ద గ్రామంలో సాంబశివరాజు వర్ధంతి శనివా రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పించి, కాసేపు మాట్లాడారు. రాష్ట్ర మంత్రిగా సాంబశివరాజు ప్రజలకు ఎన్నో సేవలను చేశారని, విలువలతో కూడిన రాజకీయాలకు ఆయనే నిదర్శనమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

విజయనగరం ఫూల్‌బాగ్: నగరంలోని మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని ఆధునీకరించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మహాకవి అప్పారావు ఇల్లు మురికికూపంగా తయారైందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏటా గురజాడ జయంతి, వర్ధంతి చేసిన తర్వాత ఆ గృహాన్ని అలా వదిలేస్తున్నారని, మీరైనా పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆపార్టీ జిల్లా ప్రతి నిధులు నాగభూషణం,తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌తో రాజకీయ ఆటలొద్దు



ఎస్.కోటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

- ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు
- అంబేడ్కర్‌ను అవమానించొద్దు
- పరిపాలనపై దృష్టి పెట్టండి
- అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల కొవ్వొత్తుల ర్యాలీ



ఎస్.కోటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులు పెట్టి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: ప్రపంచం మెచ్చుకునే మేధావి...సమాజంలో అసమానతలు పోవాలని అహరహం పనిచేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై రాజకీయ బురద జల్లటం అమానవీయం అని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం రాత్రి ఎస్.కోట పట్టణంలోని దేవీ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు పెట్టి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏరాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో అంబే డ్కర్ స్మృతివనం ఏర్పాటు చేసిందని చెప్పారు. అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో గత ప్రభుత్వం పని చేసిందన్నారు. మహనీ యుడు అంబేడ్కర్ విషయంలో రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అంబేడ్కర్ స్మృతివనంలో శిలాఫలకాలు పగలకొట్టటం సరికాదని, దేశం మెచ్చుకునే స్థాయిలో ఉన్న స్మృతివనంలో దాడులు మంచి పద్ధతి కాదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు మేలు చేసి అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, ఎస్.కోట వైస్ ఎంపీపీ పిని శెట్టి వెంకటరమణ, మాజీ డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎస్.కోట పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, వాకాడ రాంబాబు, సహా ఐదు మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కుటుంబానికి పరామర్శ



కెంబూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్త రాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. పట్టణంలోని లావేరురోడ్‌లో కెంబూరి నివాసానికి శనివారం ఆయన వెళ్లి కెంబూరి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యేగా కెంబూరి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కెంబూరి మృతికి గల కారణాలను ఆయన మేనల్లుడు,టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున వివరిం చారు. కెంబూరి సోదరులు లక్ష్మణమోహ న్, భరత్‌మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వరహాలనాయుడు, గవిడి సురేష్, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, లెంక శ్రీరాములు, యలకల అప్పలనాయుడు, పొన్నాడ కుమార్, గుడివాడ తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ...

మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శనివారం పరామర్శించారు. చీపురుపల్లిలో కెంబూరి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి



ప్రజలకు అవగాహనకల్పిస్తున్న వైద్యాధికారి వెంకటేష్

గంట్యాడ: మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ సూచించారు.పెదవేమలి గ్రామంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు వ్యాధులు దోమల వల్లే వ్యాప్తి చెందుతాయని, దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంట్లో, నివాస పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు, చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన తర్వాత రోజుల తరబడి ఇంట్లోనే ఉండిపోకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ తినకూడదని తెలిపారు. ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో జిల్లా అంధత్వనివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్, అమ్మసేవా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరంలో నేత్రపరీక్షలు చేసి, అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేయను న్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన వారిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ లు చేయించనున్నట్లు తెలిపారు.నేత్ర సమస్యలు ఉన్న మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

బొండపల్లి: మండలంలో గత కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. ప్రధానంగా రాత్రి సమయాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో మాదిరిగా ఉక్కపోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు దోమలు విజృంభిస్తుండ డంతో ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కోతలు విధిస్తున్నారని, కనీసం రాత్రి పూట అయినా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న ఏఎస్ఐ కామేశ్వరరావు, ఆశయ రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న గరివిడి మండలంలోని కొండల క్రిష్ణపురం గ్రామానికి చెందిన వెంపడాపు కాళిదాసు అనే యువకుడికి సహృదయ ఫౌండేషన్ వైద్యఖర్చుల నిమి త్తం రూ.10వేలు సహాయం చేసింది. కాళిదాసుకు గతం బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. రెండోసారి ఆరోగ్య సమస్య తలెత్తడంతో గతేడాది మళ్లీ ఆపరేషన్ చేయించారు. నెలకు రూ.8 వేలు మందుల ఖర్చులకు అవుతున్నాయి. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఆ కుటుంబానికి సహాయం చేయా లని అదే గ్రామానికి చెందిన, గుర్ల ఏఎస్ఐగా పనిచేస్తున్న బెల్లాన కామేశ్వరరావు, చీపురుపల్లి ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తాడివాక బిందును కోరారు. దీంతో ఆమె స్పందించి రూ.10 వేలు సమకూర్చారు. నగదును బాధితుడికి ఏఎస్ఐ కామేశ్వరరావు,ఆశయ రమణ శనివారం అందజేశారు. గ్రామస్తులు బాలకృష్ణ, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



జామి: జామిలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): యూటీఎఫ్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు



కొత్తవలస: ఎమ్మార్సీలో నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జామి: స్థానిక అల్లువీధి ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) స్వర్ణోత్సవాలను శనివారం ఘనంగా నిర్వ హించారు. యూటీఎఫ్ జెండాను ఆ సంఘం సీనియర్ నాయకులు సీహెచ్.సత్యనారాయణ ఎగురవేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ యూటీఎఫ్ మరింత కృషి చేస్తుందన్నారు. సంఘ నాయకులు పలువురు మాట్లాడుతూ డిసెంబర్‌లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్వర్ణోత్సవ సంబరాలకు అధిక సంఖ్యలో మండల ఉపాధ్యా యులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. సంఘం సీనియర్ నాయకుడు కొల్లి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ఏ.వి. ఆర్.కె.ఈశ్వరరావు, నాయకులు బి.చంద్రరావు, ఎం.తాతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం స్వర్ణోత్సవ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను నాయకులు ఎగురవేశారు. ఉపా ధ్యాయ, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ 50 ఏళ్లుగా చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏ.సత్య శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాస్, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తవలసలో...

కొత్తవలస: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నీలి సత్యప్రసాద్ పతాక ఆవిష్క రణ చేశారు. అనంతరం సంఘం సభ్యులు యూటీఎఫ్ ఉద్యమ గీతాన్ని ఆలపించారు.సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిర్మలాదేవి, విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. సంఘం సభ్యులు జి.వెంకటనాయుడు, వి.వాసు, సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.విజయబాపన్న తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



వేపాడ: జగ్గయ్యపేటలో మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ సభ్యులు, అతిథులు



శృంగవరపుకోట: ఎస్.కోట హైస్కూల్‌ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ డీఎం రమేష్, గురునాయుడు, తదితరులు



శృంగవరపుకోట: ఉసిరి గ్రామ శివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ సభ్యులు

వేపాడ/శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని శ్రీకాకుళం వ్యవసాయశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి అన్నారు. హరిత ఇంటిగ్రేటెడ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా వేపాడ మండలంలోని జగ్గయ్యపేటలో, ఎస్.కోట మండలంలోని ఉసిరి గ్రామంలోని శివాలయంలో శనివారం మొక్కలు నాటారు. అతిథిగా హాజరైన రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం హరిత సంస్థ రెండు జిల్లాలో కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన దిశగా పల్లె ప్రజలకు సంస్థ సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. టీఎస్‌టీయూసీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు విక్రమ్ జగన్నాథం మాట్లాడుతూ సాగులో యాంత్రీకరణ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జియో(గ్రీన్ ఎర్త్ ఆర్గ నైజేషన్)వ్యవస్థాపకుడు రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ మండలంలో స్వచ్ఛంద సంస్థ తమ శాఖలను విస్తరింపజేయాలన్నారు. హరిత ఇంటిగ్రేటెడ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.హరిబాబు మాట్లాడుతూ వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా 32 లక్షలకు పైగా మొక్కలు నాటామన్నారు. ఆసంస్థ సభ్యులకు టీషర్ట్‌లు, జగ్గయ్యపేట గ్రామస్తులకు 200 మొక్కలు అందజేశారు హరిత సంస్థ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎస్.దేముళ్లు, జి.సురేష్, ఎం.అర్జున, అప్పారావు, బి.హృషీకేశ్, లాస్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు మొక్కలు నాటండి

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున పది మొక్కలు నాటాలని, ఇది పర్యావరణ సంప్రదాయం కావాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ గురునాయుడు తనపుట్టిన రోజు సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. అతిథులుగా డీఎం రమేష్‌తో పాటు జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌తో కమాండ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

శృంగవరపుకోట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవచ్చని, క్రమశిక్షణతో పాటు గొప్పవ్యక్తిత్వాన్ని అలవర్చుకోవచ్చని ఆంధ్రా బెటాలియన్ కమాండ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ యూనిట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ యూనిట్‌లో క్యాడె ట్లు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలు, సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ లక్ష్యాలను, విధులను, ఉద్దేశ్యాన్ని మరోమారు క్యాడెట్లకు వివరించారు. శరీరాన్ని శారీరకంగా, మానసికంగా ధృడంగా సిద్ధం చేసుకోవడం మన చేతుల్లో పని అనా అన్నారు. ఎన్‌సీసీ మీ వ్యక్తిగత జీవితంతో పాటూ దేశానికి మీరు ఉపయోగపడేలా సిద్ధం చేస్తుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ–'సి' సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలు సాధిస్తున్నారని, రెండేళ్లుగా తమ విద్యార్థులు అగ్నిపథ్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ వలీఖాన్, అధ్యాపకులు కె.వాసుదేవరావు, డాక్టర్ సుధీర్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల సందడి



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

గజపతినగరం: స్వాతంత్య్ర వేడుకల నేపథ్యంలో పాఠశాలల్లో ఆటల పోటీల సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సా హంగా పోటీ ల్లో పాల్గొంటున్నారు. పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం చిప్పాడ రమేష్‌కుమార్ ఆధ్వ ర్యంలో శనివారం కబడ్డీ, ఖోఖో, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ ఆటల పోటీలతో పాటు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆగస్ట్ 15న స్వాతంత్య్ర వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

అమృతశ్రీ వర్షిణి సంగీత పాఠశాలకు గరుడ అవార్డులు



గరుడ అవార్డులతో అమృత శ్రీవర్షిణి సంగీత, నృత్య పాఠశాల డైరెక్టర్లు, విద్యార్థులు

విజయనగరం టౌన్: నగరానికి చెందిన అమృతశ్రీ వర్షిణి సంగీత, నృత్య పాఠశాలకు గరుడ అవార్డులు లభించినట్లు పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ తెలికిచర్ల శనివారం తెలిపారు. జాతీయ నృత్యోత్సవాల్లో భాగంగా విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో హైదరాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్ బిందు లిమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నృత్య విభాగంలో నృత్య దర్శకురాలు సౌమ్య తెలికిచర్లకు గరుడ అవార్డు, సామాజిక సేవా విభాగంలో అనిల్‌కు నటరాజ నంది అవార్డులు లభించాయి. వీరితో పాటు పాఠశాలలో నృత్య అభ్యసనం చేస్తున్న 21 మంది విద్యార్థులు ఆ కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి, గరుడ, నంది, నటరాజ పురస్కారాలు అందుకున్నారని తెలిపారు.